క్లుప్తంగా

8న ఉత్తర నక్షత్ర పూజలు

సామర్లకోట: పట్టణంలో అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణస్వామి సన్నిధిలో మే 8వ తేదీన ఏకాదశి ఉత్తర నక్షత్ర పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి అమ్మ వార్లకు క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రామానుజన్ సేవలు చిరస్మరణీయం



సామర్లకోటలో రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: భారతదేశ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణిత వ్యాప్తికి చేసిన సేవలు చిరస్మరణీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామ కృష్ణ అన్నారు. రామానుజన్ 105 వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానుజన్ జీవిత విశేషాలను ప్రతి విద్యార్థి తెలుసుకొని స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.అరుణ, వాకపల్లి రాజు, పి. బ్రహ్మానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత్రుళ్ల వీధిలో అన్నదానం



సామర్లకోట పాత్రుళ్లవీధిలో అన్నదానం

సామర్లకోట: స్థానిక పాత్రుళ్ల వీధిలో శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఉగాది సంబరాల ముగింపును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ అన్నదానాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ నాయకులు పెదిరెడ్ల కృష్ణ, కర్రి ఉమామహేశ్వరరావు, బొడుగు ప్రసాద్, పెదిరెడ్ల నర్సింగ్, బొడుగు శ్రీను, కర్రి రామకృష్ణ, పెదిరెడ్ల రాజు, వెలిశెట్టి శివాజీ భక్తులకు సేవలందించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కాకినాడ రూరల్: కాకినాడలోని ఎస్.అచ్యుతాపురం అంబేడ్కర్ సెంటర్‌లో నివాసం ఉంటున్న కుక్కల నానిపై హత్యాయత్నానికి పాల్పడిన అదే ప్రాంతానికి చెందిన పెంటి కృష్ణ ప్రసాద్(జాజి)ను శనివారం అరెస్టు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు తెలిపారు. ఇంటి సరిహద్దు విషయమై ఇరు కుటుంబాల మధ్య వివాదం నేపథ్యంలో ఇంట్లో పడుకున్న నానిపై శుక్రవారం చాకుతో దాడి చేసి చంపేందుకు రెండు చోట్ల పొడిచి పారిపోవడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరారీలో ఉన్న నిందితుడిని ప్రత్యేక బృందం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమీనాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429
తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378

చల్లచల్లని.. కూల్ కూల్

- తాటిముంజెలతో వేసవి తాపం నుంచి ఉపశమనం
- పోషకాలతో ఆరోగ్యానికి మేలు
- చిరు వ్యాపారులకు చక్కని ఉపాధి



పెద్దాపురం మెయిన్‌రోడ్డులో ముంజెలు అమ్ముతున్న వ్యాపారులు

పెద్దాపురం: ఎండలు మండిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రస్తుత వేసవిలో శీతల పానీయాలను ఎక్కువగా తీసుకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. కాగా ప్రకృతిసిద్ధంగా లభించే తాటి ముంజెలు (ఐస్ యాపిల్) ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు వైద్యులు. మంచి పోషక విలువలతో పాటు శరీరాన్ని చల్లపర్చగలిగే గుణం తాటి ముంజెల్లో ఉంది. పెద్దాపురం మండలంలోని పలు గ్రామాల్లో కార్మికులు తాటి ముంజెలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గ్రామాల నుంచి తీసుకువచ్చి మెయిన్‌రోడ్డులో విక్రయిస్తున్న తాటి ముంజెలకు మంచి గిరాకీ ఉంది. ఏడాదికి ఒక్కసారి వేసవి సీజన్‌లో మాత్రమే లభించే తాటి ముంజెలు తప్పకుండా తినాలని వైద్యులు సూచిస్తున్నారు. వీటిని తినడం ద్వారా వేసవి తాపం నుంచి ఉపశమనం కలగడమే శరీరానికి మంచి పోషక విలువలు లభిస్తాయి. మెట్ట గ్రామాల నుంచి తీసుకువచ్చే ఈ ముంజెలను డజన్ రూ.60కి విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులు వీటిని ఇంటికి తీసుకువెళ్లి ఫ్రిజ్‌లో పట్టుకుని మరీ తింటున్నారు. పిల్లలు నుంచి పెద్దల వరకూ వీటిని తినేందుకు ఆసక్తి చూపడంతో హాట్ కేకుల్లా అమ్ముడైపోతున్నాయి.

పోషక విలువలు ఇలా..

తాడిచెట్టును ఇంగ్లిష్‌లో పల్మైలెత్రి అంటారు. దీని శాస్త్రీయనామం బోరానస్ ఫ్లాబెలిఫెర్. తాడిచెట్టులో అన్ని భాగాలు ఉపయోగపడతాయి. తాటి ముంజెల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. వంద గ్రాముల ముంజెలను తీసుకుంటే వాటిలో 92.5 గ్రాములు నీరు, 0.6 గ్రాముల ప్రోటీన్లు, 0.1 గ్రాముల కొవ్వు, 0.2 గ్రాముల బూడిద, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 6.4 గ్రాములు కార్బోహైడ్రేట్స్, 12 మిల్లి గ్రాములు కాల్షియం, 21 మిల్లి గ్రాముల పాస్పరస్, 0.3 గ్రాముల ఇనుపదాతువు, 61మిల్లి గ్రాముల ఆస్కార్బిక్ ఆమ్లం ఉంటుందని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న తాటికాయలు

వ్యాధులు దరి చేరవు



తాటి ముంజెలు తినడం వల్ల దాహం తీరుతుంది. మినరల్స్ తాటి ముంజెల్లో సమతుల్యంగా లభిస్తాయి. విటమిన్ బి, ఐరన్, కాల్షియం, ఏ బి సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఐరన్, జింక్ ఫాస్పరస్, పొటాషియం ఉంటాయి. ముంజెలు తింటే కాలేయ సంబధిత వ్యాధులు దరి చేరవు. అలసటను దూరం చేసే లక్షణం తాటి ముంజెలకు ఉంది.

– డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, పీహెచ్‌సీ వైద్యులు, కాండ్రకోట

రుణాలిచ్చి ఆదుకోవాలి



వేసవి కాలంలో మండుటెండను సైతం లెక్క చెయకుండా వ్యాపారాలు సాగిస్తున్నాం. సీజన్ వ్యాపారం అయినప్పటికీ ముందు రోజు చెట్లెక్కి కాయలు తీసి ఇక్కడకు తీసుకువస్తాం. స్వయంగా వినియోగదారులు ఎదురుగానే ముంజెలు తీసి విక్రయిస్తాం. మాలాంటి కార్మికులకు ప్రభుత్వం రుణాలిచ్చి ఆదుకోవాలి.

– సిమ్మ ఏసు, జె.తిమ్మాపురం, పెద్దాపురం మండలం

లాడ్జీలు, పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు



సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లోని పార్శిల్ కార్యాయంలో తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణభగవాన్ తదితరులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని లాడ్జీలు, పార్శిల్ కార్యాలయాలను శనివారం సాయంత్రం పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో లాడ్జీలు, బస్సు కాంప్లెక్స్‌లోని పార్శిల్ కార్యాలయం, రైల్వే స్టేషన్ లోని పార్శిల్ కార్యాలయం, వాహనాలను తనిఖీ చేశారు. లాడ్జీ గదుల్లో దిగే వారి వివరాలను పోలీసులు సేకరించారు. గంజాయి, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యక్రమాలు లాడ్జీల్లో జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఇకపై తరచూ తనిఖీలు చేస్తామని, అనుమానాస్పద వ్యక్తుల వివరాలపై సమాచారం ఇవ్వాలని లాడ్జీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. పార్శిల్ చేసే వ్యక్తుల వివరాలు పూర్తిగా ఉండటంతో పాటు పార్శిల్‌లో ఉన్న వస్తువుల వివరాలు ఉండాలన్నారు. ఆయా లాడ్జీల్లో సీసీ కెమెరాల పని తీరు, సీసీ ఫుటేజ్ రికార్డింగ్‌లను పరిశీలించారు. లాడ్జీలు, బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎటువంటి సమాచారం లభించలేదని సీఐ తెలిపారు.

‘షారోహెన్’కు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు



నిర్వాహకుల నుంచి గిన్నిస్ వరల్డ్ రికార్డు అవార్డు అందుకుంటున్న షారోహెన్ బెల్ ఆలీస్

సామర్లకోట: అరుదైన సరళీ స్వరాల విభాగంలో సామర్లకోటకు చెందిన అంతర్జాతీయ టీవీ వర్తమానకులు డాక్టర్ ఈలి సువార్తరాజు కుమార్తె షారోహెన్ బెత్ ఆలిష్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించింది. స్థానిక బ్రౌన్‌పేట ట్రూ గాస్పల్ చర్చిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వరల్డ్ రికార్డు వివరాలు తెలియజేశారు. అవార్డు గ్రహీత షారోఇన్ బెత్ ఆలిష్ మాట్లాడుతూ విజయవాడలోని హెలెల్ మ్యూజిక్ స్కూల్‌లో కీబోర్డు శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. ఈ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 1న ఒకేసారి 1090 మంది విద్యార్థులు మూడు సరళీ స్వరాలను 54 సెకండ్లలో కీబోర్డు ద్వారా ప్లే చేసి ఇన్‌స్టాగామ్‌లో అప్లోడ్ చేసిన్నట్లు తెలిపారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు వీరిలో కొంత మందిని ఎంపిక చేసి అవార్డులను అందజేశారన్నారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని ద లైఫ్ చర్చిలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి ఆనందరాజు, హెలెల్ మ్యూజిక్ స్కూల్ మాస్టార్ అగస్టీన్ దండింగి వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ అవార్డును సాధించినట్టు చెప్పారు. అవార్డు గ్రహీత షారోహెన్‌బెత్ ఆలిస్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు షారోన్, సువార్తరాజు పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో నాగబాబు ప్రతిభ



పతకాలు సాధించిన నాగబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే, కౌడా చైర్మన్‌లు

సామర్లకోట: జాతీయ వెటరన్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ 2025లో సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడు బహుమతులు సాధించాడు. ఈ సందర్భంగా సామర్లకోటలో శనివారం నాగబాబును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్‌లు గోలి వెంకటఅప్పారావు చౌదరి, యర్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి పాల్గొన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకూ కర్ణాటకలోని మైసూర్ చాముండి విహార స్పోర్ట్స్ స్టేడియంలో 44వ వెటరన్ జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కాకినాడ ప్రభుత్వ ఆరోగ్యశాఖలో మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్న సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో మూడు కాంస్య పతకాలు సాధించాడు. 50 ఏళ్ల పైబడిన వయస్సులోనూ పతకాలు సాధించిన నాగబాబును మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తన చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామా క్షేత్రంలోని కుమారరామభీమేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రి కావడంతో స్వామివారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను, ఉప ఆలయాలను దర్శించుకున్నారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో భక్తులు బారులు తీరారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు ప్రసాదంగా అందజేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లికి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిదిరాజు వెంకన్నలు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన పంచాయతన సమేత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం మాస శివరాత్రి, శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు స్వామివారికి పంచామృతాలు, సుగంధ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. నమక, చమకాలతో శ్రీసూక్త ,దుర్గాసూక్త, సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ అర్జీలను అందజేయాలని ఆమె కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన యాక్షన్ ప్లాన్‌పై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం నియోజకవర్గ స్థాయి అధికారులతో విజన్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి శాఖ నుంచి ప్రగతి ఉండేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట ఎంపీడీఓలు శ్రీలలిత, హిమమహేశ్వరి, ఏఓ సంజయ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనను వెలికి తీయడానికి శిక్షణ

సామర్లకోట: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి శిక్షణలు ఎంతో దోహదపడతాయని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 24 నుంచి నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటిఎల్) శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గండేపల్లి, ఉండూరు, మల్లాం, కిర్లంపూడి, స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇచ్చామని తెలిపారు. కోడింగ్ ఫొటోట్రానిక్స్, 3డీ డిజైనింగ్ తదితర అంశాల్లో నైపుణ్యం పెంచేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మూడు రోజుల పాటు విద్యార్థులు నేర్చుకున్న అంశాలను కోర్సు కో ఆర్డినేటర్, హెచ్‌ఎం యు.మీనా మాధురి వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం

తుని: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా తుని రైల్వేస్టేషన్‌లో శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాతో రైల్వేస్టేషన్ ప్రాంగాణాన్ని పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులు, పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేశారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ, లా అండ్ అర్డర్ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, చోరీల నియంత్రణ తీసుకోవాలిత్సిన జాగ్రత్తలను డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. తుని పట్టణ, రూరల్ సీఐలు గీతా రామకృష్ణ, చెన్నకేశవరావు, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

తుని: పదహారో నంబర్ జాతీయ రహదారిపై జగన్నాథగిరి జంక్షన్‌లో శనివారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో వానవాల తనిఖీలు నిర్వహించినట్టు తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి తెలిపారు. లైసెన్స్, వాహన రికార్డులను పరిశీలించారు. జాతీయ రహదారిపై దూరప్రాంతాలకు ప్రయాణించే వాహనాలు వేగ నియంత్రణతో పాటు మద్యం సేవించి నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

కిర్లంపూడి: ప్రభుత్వ నిషేధిత మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీహరిరాజు హెచ్చరించారు. నేరాల నిరోధన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు.

జగ్గంపేట: స్థానిక బస్టాండ్, పార్శిల్ ఆఫీసులు, ఇతర ప్రాంతాల్లో పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ ఆఫీసులో పలు వస్తువులు ఎవరికి వెళుతున్నాయి అనే దానిపై వివరాలు సేకరించారు. బస్టాండ్‌లో అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు.

శాంతివర్ధన సేవలు భేష్

- జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ



శాంతివర్ధనలో వంటగదిని పరిశీలిస్తున్న జడ్జి బుల్లెమ్మ

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న వంతుల పాఠశాల సంస్థ సేవలు అభినందనీయమని పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి జి.బుల్లెమ్మ అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం శాంతివర్ధన పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, పారా లీగల్ వలంటీర్ల బృందంతో కలిసి ఆమె అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి బుల్లెమ్మ మాట్లాడుతూ మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో విభిన్న ప్రతిభావంతులకు సేవలందిస్తున్న శాంతివర్ధన వీరబాబు, సత్య దంపతుల సేవలను కొనియాడారు. పాఠశాల రికార్డులు, మరుగుదొడ్లు, విద్యార్థుల వసతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల్లో విద్యార్థులకు అందుతున్న ఫిజియోథరపీ సేవలపై ఆరా తీశారు. విభిన్న ప్రతిభావంతులకు మంజూరైన ఆర్టీసీ బస్సు పాస్‌లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, న్యాయవాదులు మడికి రాంబాబు, దుర్గారావు, గణేష్, నానిబాబు, కుమారి, వినియోగదారుల సంఘం అధ్యక్షులు బి.సూర్య నారాయణ. పాఠశాల ఏఓ వేణు, బాబి, బుజ్జి, శివ, విశాల, దేవి, సరోజిని, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మేడే కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే 139వ మేడే వారోత్సవాల కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. గొల్లప్రోలు జగనన్న కాలనీలో ఏఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఉద్యోగాల తొలగింపు, కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థకు నిరసనగా మేడే వేడుకలు నిర్వహించాలని ఏఐఎఫ్‌టీయూ, ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర కమిటీలు పిలుపును ఇచ్చాయన్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మే 1 నుంచి 6వ తేదీ వరకు వివిధ గ్రామాలు, నగరాల్లో జెండా ఎర్ర జెండాలను ఎగరవేసి సభలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్మిక హక్కులను కాల రాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి, గొర్ల శివ, కేశవరపు వీరన్న, మేడిశెట్టి గణేష్, కానూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డపై వివక్షను పూర్తిగా రూపుమాపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ఆడశిశు జననాలపై వివక్షను పూర్తిగా రూపుమాపేందుకు పీసీపీఎన్‌టీడీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కోర్టు హాలులో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపటిసారిలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను కమిటీ ఆమోదం జారీ చేసింది. జిల్లాలో అల్ట్రా సౌండ్ స్కానర్లను పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయకుండా ఉండేలా స్కానింగ్ సెంటర్లలో నిర్వహించిన రహస్య డెకాయ్ ఆపరేషన్లపై ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ మీనా సమీక్షించి వాటికి చేసిన ఖర్చును ఆమోదించారు. డెకాయి ఆపరేషన్లు నిరంతరం కొనసాగించాలని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీసీపీఎన్టీడీ చట్టంలో నిర్దేశించిన నిబంధనలు అన్ని స్కానింగ్ సెంటర్లలో తప్పనిసరిగా పాటించేలా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రమేష్, డాక్టర్ సరిత, డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఏపీపీ డి.నాగబాబు, పోలీస్ అధికారి పి.రామచంద్రరావు, డెమో రాజు, ఎన్‌జీవో ప్రతినిధులు ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై మిశ్రమ స్పందన



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నేతలు

బోట్‌క్లబ్ : వక్ఫ్ సవరణ బిల్లు–2025 సవరణ చట్టంపై స్థానిక గాంధీ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. గాంధీ భవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ సమన్వయ కర్తగా నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు వక్ఫ్ చట్టంపై మిశ్రమ స్పందనలను వ్యక్తం చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి ఎనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ రామ జన్మభూమిలో రాముని గుడి నిర్మాణానికి రుజువులు చూపించమని అడ్డంకులు సృష్టించిన నేతలు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పేరిట వాటికి ఉన్న కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను కంప్యూటరీకరించడానికి కేంద్రం చట్టం తీసుకుని వస్తే తీవ్రంగా వ్యతిరేకించడం అప్రజాస్వామ్యమన్నారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ సయీద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులకు దాతలు ఇచ్చిన కోట్లాది రూపాయల ఆస్తులకు లెక్కా పత్రం లేకుండా పోవడంతో వాటి నిర్వహణ అవినీతి మయంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు, దర్గాలను నిర్వహించే మతావలి వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకురావడాన్ని హర్షించదగిన విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.శివ గణేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వక్ఫ్ చట్టం ఏవిధంగా అమలు చేస్తున్నారో, అదే విధంగా హిందూ ధార్మిక చట్టాన్ని కూడా దేశ వ్యాప్తంగా ఒకే చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం సవరణలో భాగంగా అన్య మతస్తులను చేర్చడం దారుణమైన విషయమన్నారు. న్యాయవాది విశ్వనాథ శ్రీనివాసరాజు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల సంరక్షణతో పాటుగా పేద ముస్లింలకు మేలు చేకూరేలా చేసిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని అంగీకరించక తప్పదన్నారు. ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి జవహర్ మాట్లాడుతూ వక్ఫ్ బై యూజర్ నిబంధన ముస్లిం ఆస్తులను చిన్నాభిన్నం చేయడానికి ఉద్దేశించినదిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ భవన్ ప్రధాన కార్యదర్శి వైఎస్‌వీఎస్ మూర్తి, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంవీఆర్ ఫణీంద్ర, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, డాక్టర్ పాలెపు రవి పాల్గొన్నారు.